క్లుప్తంగా

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి

● మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు


అన్నా రాంబాబు

మార్కాపురం: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగను ప్రజలు సంతోషంగా నిర్వహించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు పేర్కొన్నారు. దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

బాణసంచా విక్రేతలు నిబంధనలు పాటించాలి


దుకాణాలను పరిశీలిస్తున్న సీఐ రామకోటయ్య

కొమరోలు: బాణసంచా దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని గిద్దలూరు సీఐ రామకోటయ్య హెచ్చరించారు. కొమరోలు పట్టణంలోని వాసవీ మాత ఆలయం ఎదురు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఐ బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల వద్ద ఇసుక, కార్బన్ డైఆక్సైడ్, నీటిని తప్పనిసరిగా అందుబాటులో పెట్టుకోవాలని చెప్పారు. సీఐ వెంట ఎస్సై వెంకటేశ్వర్లునాయక్ ఉన్నారు.

పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలు


అరవింద స్కూల్లో టపాసులు కాలుస్తున్న విద్యార్థులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని వివిధ పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలను బుధవారం నిర్వహించారు. పట్టణంలోని అరవింద, వాసవీ, సాయి చైతన్యతో పాటు పలు పాఠశాలల్లో విద్యార్థులు బాణసంచా కాల్చి సందడి చేశారు. పాఠశాలల కరస్పాండెంట్ సి.వాణీ రాధకృష్ణ, హెచ్ఎం కె.రంగయ్య, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రత్యేక వేషధారణలో వాసవీ స్కూల్ విద్యార్థులు

బాణసంచా దుకాణాల పరిశీలన



దుకాణాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

పొదిలి: పట్టణంలోని విశ్వనాథపురంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను బుధవారం కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. అధికారులకు, దుకాణదారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. నిబంధనల మేరకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్ఐ కె.సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

గిద్దలూరు రూరల్: కుక్కల దాడిలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. ఉప్పలపాడుకు చెందిన కిట్టయ్య అనే వ్యక్తి తన పొలం వద్దకు వెళ్తున్న సమయంలో కుక్కలు ఒక్కసారిగా దాడికి తెగబడ్డాయి. కుక్కలను ఎంత అదిలించినా బెదరకుండా కాళ్లు, చేతులపై కరిచాయి. తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించినట్లు బంధువులు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో అన్న సంతర్పణ


భిక్ష తీసుకుంటున్న మాలధారులు

పొదిలి: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో ఊరిపిండి మధు, అనంతలక్ష్మి దంపతులు బుధవారం మాలధారులకు అన్న సంతర్పణ చేశారు. దాతలతో ఆలయ పూజారి మురళీకృష్ణమాచార్యులు, వాసు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో గురుస్వాములు అప్పల శంకర్, గంజి సుబ్బారావు, యక్కలి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సకల దీక్షా స్వాములకు చద్ది ఏర్పాటు

ఏటా మాదిరిగానే సకల మాలధారణ స్వాములకు త్వరలో చద్ది ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక నిర్మమహేశ్వర స్వామి ఆలయంలో చద్ది ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

పరిహారం.. ఇచ్చేదెప్పుడు?

- ఈ ఏడాది రబీ, ఖరీఫ్ సీజన్‌లో భారీగా దెబ్బతిన్న పంటలు
- గత రబీలో 4,730 హెక్టార్లు, ఈ ఖరీఫ్‌లో 3,735 హెక్టార్లలో పంట నష్టం
- అన్నదాతలకు అందించాల్సిన రబీ పరిహారం రూ.4.65 కోట్లు
- మార్కాపురం సబ్ డివిజన్‌లో 5,940 మంది ఎదురుచూపులు
- పరిహారం మంజూరులో ప్రభుత్వ జాప్యంపై రైతుల ఆగ్రహం


రబీలో ఎండిపోయిన సజ్జ పంట

మార్కాపురం: పంటల బీమా పరిహారం మంజూరులో రాష్ట్ర ప్రభుత్వ అలవిమాలిన జాప్యం అన్నదాతలను ఆర్థిక కష్టాల్లో ముంచేసింది. ప్రకృతి విపత్తుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఉదారంగా ఆదుకోవాల్సిన ప్రభుత్వం పరిహారం మంజూరుపై ఎలాంటి నిర్ణయం వెల్లడించకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. అధిక వర్షాలు లేక కరువు కారణంగా పంటలు నష్టపోతే అదే సీజన్లోనే నష్టపరిహారం అందించి రైతులకు అండగా నిలిచారు. దీనికి తోడు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించి పంటల సాగుకు ఊతమిచ్చారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసాల్లో కరువు కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించేందుకు ఎన్యుమరేషన్ పూర్తి చేసి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. అయితే ఎన్నికల కోడ్ పేరుతో ఎలక్షన్ కమిషన్ బ్రేకులు వేయడంతో నష్టపరిహారం అందించలేకపోయారు.

నాలుగు నెలల క్రితం సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొంది అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పంట నష్ట పరిహారం విడుదలపై తాత్సారం చేస్తూనే ఉంది. లబ్ధిదారుల జాబితా సిద్ధంగా ఉన్నప్పటికీ నిధులు మంజూరు చేయకపోవడంతో ఆంతర్యం ఏమిటో పాలకులకే తెలియాలి. ఇదిలా ఉండగా ఈ నెలలో కురిసిన వర్షాలకు ఖరీఫ్‌లో పత్తి, మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మొత్తం మీద రబీ, ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయి రైతులు విలవిల్లాడుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టం సంభవిస్తే అదే సీజన్‌లో నష్టపరిహారాన్ని అందించడంతో రైతులు వెంటనే కోలుకున్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేకపోవడంతో రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. అకాల వర్షాలు, తెగుళ్ల వల్ల పంట నష్టపోయిన రైతులు పెట్టుబడి కోసం అప్పు చేయాల్సిన దుస్థితి.

మార్కాపురం సబ్‌డివిజన్‌లో మార్కాపురం, పెద్దారవీడు, తర్లుపాడు, కంభం, అర్ధవీడు మండలాలు ఉన్నాయి. గత రబీ సీజన్‌లో డివిజన్ వ్యాప్తంగా రైతులు మిర్చి, పత్తి, అపరాలు తదితర పంటలను సాగుచేశారు. పత్తి, మిర్చి పంటలపై తెగుళ్ల దాడి చేయడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. తెగుళ్ల నివారణ కోసం రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేశారు. ముఖ్యంగా మినుము, కంది, సజ్జ, పొద్దుతిరుగుడు, ఆముదం, నూగు, జొన్న తదితర పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది జూన్ 20న కేంద్ర కరువు బృందం మార్కాపురం ప్రాంతంలో పర్యటించింది. ఈ బృందం పర్యటించి 4 నెలలు గడిచినా ఇంతవరకూ పరిహారం రాలేదు.

ఈ ఏడాది ఖరీఫ్‌లో నష్టం ఇలా..

ఈ నెలలో కురిసిన అకాల వర్షాలకు మార్కాపురం సబ్ డివిజన్‌లో సుమారు 3,735 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు తాత్కాలికంగా అంచనా వేశారు. ఇందులో పత్తి 3001 హెక్టార్లు, పొగాకు 347, మినుములు 295, అలసంద 82 హెక్టార్లలో, అలాగే వందలాది ఎకరాల్లో సజ్జ, కొర్ర తదితర పంటలు కూడా దెబ్బతిన్నాయి. వీటికి కూడా నష్టపరిహారం రావాల్సి ఉంది. ఏడాది వ్యవధిలో రైతులు రెండు సీజన్లను కోల్పోయారు.

నష్టపరిహారం అందించాలి



గత ఏడాది రబీ, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లలో రైతులు పంటలు నష్టపోయారు. వారికి ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణమే జోక్యం చేసుకుని పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి. రుణాలను రీషెడ్యూల్ చేయాలి. సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలి.

– డి.సోమయ్య, సీపీఎం నాయకులు


వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ

గత రబీలో పంట నష్టం వివరాలు

మండలం	నష్టపోయిన రైతులు	పంట నష్టం (హెక్టార్లలో)	పరిహారం (రూ.లో)
మార్కాపురం	1210	1095.44	1,08,08,300
అర్ధవీడు	1087	760.98	74,31,584
పెద్దారవీడు	788	481.41	46,30,900
కంభం	1406	1211.78	1,19,58,987
తర్లుపాడు	1449	1180.97	1,17,24,250
మొత్తం	5940	4730.58	4,65,54,021

తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి


మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణ


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- మెజార్టీ కౌన్సిలర్ల తీర్మానం
- కౌన్సిల్ సమావేశం నవంబర్ 6వ తేదీకి వాయిదా

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని మెజార్టీ కౌన్సిలర్లు తీర్మానించారు. బుధవారం పొట్టి శ్రీరాములు కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్మన్ బాలమురళీకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మార్కాపురం పట్టణంలోని కొండేపల్లి రోడ్డులో మున్సిపల్ స్థలాన్ని మసీద్ నిర్మాణానికి కేటాయించాలన్న టేబుల్ అజెండాను ఆమోదించిన తర్వాతే అజెండాలోని అంశాలను తీర్మానించాలని పలువురు కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీనిపై కమిషనర్ సమాధానం ఇస్తూ టేబుల్ అజెండాను ఆమోదించడం సరికాదని, ఏదైనా అత్యవసరమైతేనే టేబుల్ అజెండా పెట్టాలని సభ్యులకు స్పష్టం చేశారు. విలువైన ప్రభుత్వ స్థలానికి సంబంధించి కలెక్టర్ నుంచి ప్రొసీడింగ్స్ తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. కాగా మున్సిపల్ హాల్ ముందు తొలగించిన కార్మికులతో పాటు సీపీఎం నాయకులు బైఠాయించారు. వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మెజార్టీ కౌన్సిల్ సభ్యులు చైర్మన్ బాలమురళీకృష్ణ, కమిషనర్‌కు లిఖితపూర్వకంగా అర్జీ అందజేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశాన్ని నవంబర్ 6వ తేదీకి వాయిదా వేశారు. సమావేశంలో వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ, డీఈ శ్రీనివాసులు, మేనేజర్ శ్రీనివాసన్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. కార్మికుల తరఫున సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, సోమయ్య, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరి, ఇమాంసా, సుబ్బారెడ్డి, కనకయ్య, అబ్దుల్ సలాం, శ్రీను పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీలో తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

పొదిలి: స్థానిక కరుణా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని బుధవారం తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. గ్యాస్ కనెక్షన్లు, ఉచిత కనెక్షన్లు ఎన్ని ఉన్నాయనే వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఆర్ఐ కె.సుబ్బారావు, ఏజెన్సీ ఉద్యోగి మునీర్ పాల్గొన్నారు.

పురాతన రథానికి టార్పాలిన్ పట్ట ఏర్పాటు

పొదిలి: స్థానిక శ్రీనిర్మమహేశ్వర దేవస్థానం పురాతన రథం ఎండకు ఎండి, వానకు తడుస్తోంది. వెంకటగిరి రాజుల కాలంలో ఏర్పాటు చేసిన ఈ రథం దాదాపు శిథిలావస్థకు చేరింది. నూతన రథం ఏర్పాటు చేయడంతో దీనిని పక్కన పెట్టారు. అయితే దేవస్థానం అధికారులు ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. పురాతన రథం మరింత శిథిలావస్థకు చేరుతుందని భక్తులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో పండు చికెన్ యజమాని వరికుంట్ల అనిల్ టార్పాలిన్ పట్టను తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు. అనిల్‌ను భక్తులు అభినందించారు.

బెల్టు షాపులపై నిఘా ఉంచండి

కంభం: గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని కంభం సీఐ మల్లికార్జున సూచించారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి, కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట ఎస్సైలు నరసింహారావు, సుదర్శన్ యాదవ్, రవీంద్రారెడ్డితో సమావేశమయ్యారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం నిల్వలు కలిగి ఉంటే అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేయాలని సూచించారు.

త్రి ఘర్షణ షార్ట్ ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరణ

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులోని సాయిబాబా మందిరంలో బుధవారం త్రి ఘర్షణ షార్ట్ ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆసిఫ్ మాట్లాడుతూ.. షార్ట్ ఫిల్మ్‌ను పొదిలికి చెందిన కళాకారులతోనే తెరకెక్కించినట్లు తెలిపారు. త్వరలోనే విడుదల కాబోతున్న షార్ట్ ఫిల్మ్‌ను అందరూ చూసి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నటీనటులు, సాంకేతిక నిపుణులు, ప్రముఖ గాయకుడు మహ్మద్ రఫీ, రోటీ యస్దాన్, మూన్ స్టార్ రఫీ, అశోక్ బండి, సామి రాజా, కిరణ్మయి, మణికంఠ, మధు, జోషఫ్, కిషోర్, నయీమ్, అమీన్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

కంభం: మండలంలోని పాఠశాలల విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు చేయాలని ఎంఈఓ మాల్యాద్రి సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లోని సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, తరగతుల నిర్వహణను పరిశీలించారు. తప్పనిసరిగా విద్యార్థులకు అపార్ ఐడీ సిద్ధం చేయాలని, మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మండల సమన్వయకర్త పద్మావతి, సీఆర్పీలు ఉన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం గ్రామంలో బెల్ట్ షాపుపై పోలీసులు బుధవారం దాడి చేసి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ కె.సురేష్ తన సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించి 24 క్వార్టర్ బాటిళ్లు గుర్తించారు. సీఐ మాట్లాడుతూ.. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే కేపీ జన్మదిన వేడుకలు


30జిడిఎల్ఆర్24 : గిద్దలూరులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


కంభంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

గిద్దలూరు రూరల్/కంభం: వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి జన్మదిన వేడుకలను గిద్దలూరు, కంభంలో పార్టీ నేతల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గిద్దలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ కడప వంశీధర రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్యవైశ్య విభాగం నాయకుడు గర్రె చిరంజీవి, బాదం గోపాల్, నాయకులు డాక్టర్ భూమానరసింహారెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

☛ కంభం పట్టణంలోని కాపవీధిలో కేపీ నాగార్జునరెడ్డి జన్మదినం సందర్భంగా భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. పార్టీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, నాయకులు సబ్బసాని సాంబశివారెడ్డి, పాపారమణారెడ్డి, సురేష్, బాషు, ఇబ్రహీం, సుబాష్, లింగోజిపల్లి జగన్, రఘు, సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంత కష్టం.. ఎంత నష్టం


ఉరకెత్తి దెబ్బతిన్న అలసందను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న రైతు

కొనకనమిట్ల: వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు రకాల పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మార్కాపురం నియోజకవర్గంలో రబీలో సాగైన పంటలు మినుము, అలసంద, సజ్జ, మిర్చి, పొగాకు పంటలతో పాటు కూరగాయల పంటలు దెబ్బతినడంతో రైతులకు అపార నష్టం సంభవించింది. గొట్లగట్టు, చినమనగుండం, గరిమినపెంట, పాతపాడు, నాయుడుపేట, నాగంపల్లి, సలనూతల గ్రామాల్లో అలసంద, మినుము పంటలు నీట మునిగి ఉరకెత్తాయి. దీంతో చేసేది లేక రైతులు పంటలను దున్నేసి మళ్లీ సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పంట నష్ట పరిహారంపై సర్కారు నుంచి సరైన స్పందన లేకపోవడం, మళ్లీ పంటలు సాగుచేయడానికి అవసరమైన విత్తనాలు సబ్సిడీపై అందించకపోవడంతో రైతులు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్

పొదిలి: మద్యం దుకాణదారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన సర్కిల్ పరిధిలోని లైసెన్స్‌దారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరల కంటే ఒక్క రూపాయి ఎక్కువగా అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తే, ఏ దుకాణం నుంచి వెళ్లిందో గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే నిర్ణీత కాలపరిమితికి సంబంధించిన లైసెన్సులు కూడా మంజూరు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో సీఐ అరుణ కుమారి, ఎస్సై సైమన్, సర్కిల్ పరిధిలోని లైసెన్సుదారులు పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం


సమావేశంలో కౌన్సిల్ సభ్యుల మధ్య వాగ్వివాదం

గిద్దలూరు రూరల్: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. వైస్ చైర్మన్ ఆర్.డి.రామకృష్ణ మాట్లాడుతూ.. ఇటీవల నగర పంచాయతీలో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్న 11 మంది విధులకు హాజరు కావడం లేదని వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని అజెండాలో పొందుపరచడంపై ప్రశ్నించారు. ఆప్కాస్ ద్వారా చేరిన కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారి స్థానంలో కొత్తవారిని చేర్చుకునేందుకు ఎలా వీలవుతుందని నిలదీశారు. 2వ వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్‌యాదవ్ మాట్లాడుతూ.. గతంలోనూ ఇదే తరహాలో ఒప్పంద కార్మికులను నియమించారని చెప్పుకొచ్చారు. దీంతో కౌన్సిల్ సభ్యుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. సమావేశం రసాభాసగా మారడంతో వాయిదా వేశారు. కమిషనర్ డి.వెంకటదాసు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లు ఖాళీ చేయాలని దౌర్జన్యం

- తహసీల్దార్‌కు బాధితురాలి ఫిర్యాదు


అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

పొదిలి: స్థానిక టైలర్స్ కాలనీలో 20 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని పలువురు దౌర్జన్యం చేస్తున్నారని దాసు హనుమాయమ్మ, రాములు దంపతులు వాపోయారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని తెలిపారు. దాసు వెంకటేశ్వర్లు, దాసు వెంకటరావు, దాసు లక్ష్మయ్య అనే వ్యక్తులు తన ఇంట్లో సామగ్రి బయటపడేసి ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.